సాక్షి సంగారెడ్డి

ఆదివారం । 13 । ఏప్రిల్ । 2025

పోరు రాగం.. జీవన సరాగం

సోషల్ మీడియా ఫోక్ స్టార్స్‌గా సిద్దిపేట జిల్లా యువతీ, యువకులు



సండే స్పెషల్

ఉద్యమ సమయంలో ప్రత్యేక రాష్ట్ర సాధనకు గొంతెత్తిన గళం.. నేడు పల్లెలో ఉండే బాంధవ్యాలను, పల్లె సంస్కృతిని పల్లె పద బంధాలను రాగాలుగా అల్లి, పల్లెతనానికి పట్టం కట్టి, పాటలతోటలో జానపద కోకిలలుగా సరాగాలు ఆలపిస్తున్నారు. మరికొందరు పల్లె పదాల పాటల్లో నటిస్తూ, పాడుతూ.. పాటల రచయితలుగా ప్రజల మనసులను దోచుకుంటున్నారు. యూట్యూబ్‌లో లక్షల్లో వీక్షకుల మన్ననలు పొందుతున్న సిద్దిపేట జిల్లా యువకులపై ఆదివారం సాక్షి ప్రత్యేక కథనం..

దుబ్బాకటౌన్ :

8లో

న్యూస్‌రీల్

వైభవంగా హనుమాన్ జయంతి వేడుకలు



హనుమాన్ జయంతి ఉత్సవాల్లో పాల్గొన్న సంజీవరెడ్డి, మాజీ ఎంపీ బీబీ పాటిల్

నారాయణఖేడ్: హనుమాన్ జయంతి వేడుకలు నారాయణఖేడ్‌లో శనివారం ఘనంగా నిర్వహించారు. ఖేడ్ మండలం కొండాపూర్ హనుమాన్ ఆలయంలో డోలాహరణం, అభిషేకం, అలంకరణ, పూజ, మహాహారతి నిర్వహించారు. ఖేడ్ ఎమ్మెల్యే సంజీవరెడ్డి, మాజీ ఎంపీ బీబీ పాటిల్, డీసీసీ ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్‌రెడ్డి, జీఎంఆర్ ఫౌండేషన్ చైర్మన్ గుర్రపు మశ్చందర్, కాంగ్రెస్ జిల్లా నాయకులు సుధాకర్‌రెడ్డి తదితరులు పాల్గొని హనుమాన్ ఆశ్రమ పీఠాధిపతి సంగ్రామమహారాజ్ ఆశీస్సులు తీసుకున్నారు. హనుమాన్ దీక్షాధారులు దీక్షల్ని విరమించారు. ఖేడ్ కల్పన హనుమాన్ ఆలయంలో సుప్రభాతసేవ, మాన్యసుక్తాభిషేకం, చందనం తదితర కార్యక్రమాలను నిర్వహించగా ఎమ్మెల్యే సంజీవరెడ్డి పాల్గొన్నారు. ఖేడ్‌లో భజరంగ్‌దళ్ ఆధ్వర్యంలో భారీ శోభాయాత్రను నిర్వహించారు.

రైతులకు అండగా కాంగ్రెస్ ప్రభుత్వం

ఎమ్మెల్యే పి.సంజీవరెడ్డి



కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న సంజీవరెడ్డి

కల్హేర్(నారాయణఖేడ్): కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు అన్ని విధాలుగా అండగా ఉంటుందని నారాయణఖేడ్ ఎమ్మెల్యే పి.సంజీవరెడ్డి తెలిపారు. సిర్గాపూర్ మండలం కడ్పల్, నిజాంపేట్ మండలం నాగధర్‌లో శనివారం వరి ధాన్యం, జొన్న కొనుగోలు కేంద్రాలు ప్రారంభించారు. ఈ సందర్భంగా ధాన్యం చివరి గింజ వరకు కొనుగోలు చేస్తామని భరోసా ఇచ్చారు. ప్రభుత్వం రైతులకు సబ్సిడీపై వ్యవసాయ పనిముట్లు అందజేస్తుందని తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు మనీష్‌పాటిల్, నాయకులు యాదవరెడ్డి, మల్లోడ్డి తుకారాం, పీఏసీఎస్ చైర్మన్లు సంగారెడ్డి, ప్రతాప్‌రెడ్డి పాల్గొన్నారు.

డంపింగ్‌యార్డ్ మాకొద్దు

67వ రోజుకు చేరిన నిరసనలు



నిరాహార దీక్షలో పాల్గొన్న జేఏసీ నేతలు

జిన్నారం (పటాన్‌చెరు): గుమ్మడిదల మున్సిపాలిటీ పరిధిలోని ప్యారానగర్ డంపింగ్‌యార్డ్ ఏర్పాటుకు వ్యతిరేకంగా జేఏసీ ఆధ్వర్యంలో చేపట్టిన నిరసనలు శనివారం నాటికి 67వ రోజుకు చేరుకున్నాయి. నల్లవల్లి, ప్యారానగర్, గుమ్మడిదల గ్రామాల్లో రిలే నిరాహార దీక్షలు శాంతియుతంగా కొనసాగుతున్నాయి. మున్సిపాలిటీలోని దోమడుగు గ్రామ నాయకులు, ప్రజలు పాల్గొని సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా జేఏసీ కన్వీనర్ జైపాల్‌రెడ్డి మాట్లాడుతూ...డంపింగ్‌యార్డ్ ఏర్పాటుతో ప్రజల ఆరోగ్యాలతోపాటు, పాడిపశువు, వ్యవసాయంపై తీవ్ర ప్రభావం చూపుతుందన్నారు. ప్రభుత్వం వెంటనే డంపింగ్ యార్డ్ ఏర్పాటును విరమించేవరకు నిరసనలు ఆపేది లేదన్నారు. కార్యక్రమంలో జేఏసీ నాయకులు, ఆయా గ్రామాల ప్రజలు పాల్గొన్నారు.


మైనార్టీ గురుకులాల్లో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

జహీరాబాద్ టౌన్: మండలంలోని అల్గోల్ బాలుర మైనార్టీ గురుకుల పాఠశాల, కళాశాలలో ప్రవేశాల కోసం అర్హులైన విద్యార్థులనుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తోంది. 2025-26 విద్యాసంవత్సరానికి గాను 5వ తరగతిలో ప్రవేశాలు అలాగే 6వ తరగతి(మైనార్టీ)లో మిగిలిపోయిన సీట్ల భర్తీకి దరఖాస్తులను కోరుతున్నట్లు ప్రిన్సిపాల్ జే.రాములు ప్రకటనలతో తెలిపారు. 5వ తరగతిలో ముస్లిం మైనార్టీ సీట్లు 51, క్రిస్టియన్ 5, జైన్, పార్శీ, బౌద్దులు, సిక్కులకు 4, నాన్‌మైనార్టీ విద్యార్థులకు 20 సీట్లు ఖాళీగా ఉన్నాయని తెలిపారు. అదేవిధంగా జూనియర్ కళాశాలలో ప్రవేశాల కోసం కూడా దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ఆయన చెప్పారు. ఆన్‌లైన్‌లో లేదా గురుకుల పాఠశాలలో ఏప్రిల్ 30 తేదీ లోపు దరఖాస్తు చేసుకోవాలని ఆయన కోరారు.

నాణ్యమైన విత్తనాల పంపిణీకి సిద్ధం

ప్రభుత్వ నిర్ణయంతో రైతుల్లో చిగురించిన ఆశలు

- జూన్‌లో వరి, జొన్న, పప్పుధాన్యాల విత్తనాలు అందుబాటులోకి
- ముందుగా అభ్యుదయ రైతులకు పంపిణీకి నిర్ణయం
- ప్రణాళికలు సిద్ధం చేస్తున్న సర్కార్



జహీరాబాద్: రైతులకు నాణ్యమైన విత్తనాలను అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం సంసిద్ధతను వ్యక్తం చేయడంతో రైతుల్లో ఆశలు చిగురించాయి. విత్తనాలను సరఫరా చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రణాళికలను సిద్ధం చేస్తున్నట్లు వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ప్రకటించారు. గత ఐదేళ్ల నుంచి వ్యవసాయ శాఖ తరఫున విత్తనాల పంపిణీ లేకపోవడంతో రైతులు హైబ్రీడ్ రకాల వైపు మొగ్గుచూపారు. హైబ్రీడ్ విత్తనాలకు బదులు ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయ ప్రత్యక్ష పర్యవేక్షణలో ఉత్పత్తి చేసి, అన్ని రకాల నాణ్యతా పరీక్షలు చేసి విత్తనాన్ని రాష్ట్రవ్యాప్తంగా ఎంపిక చేసిన అభ్యుదయ రైతులకు అందజేయాలని నిర్ణయించింది. ఒక్కో గ్రామంలో ముగ్గురి నుంచి ఐదుగురికి విత్తనాలు అందిస్తారు. వారు పండించిన తర్వాత వచ్చిన పంటను రైతులకు రెండో పంటగా అవే విత్తనాలను వాడుకోవచ్చు. ఇలా మూడేళ్ల కాలంలో గ్రామంలోని రైతాంగానికి అంతా తక్కువ ధరలో నాణ్యమైన విత్తనాలు అందుబాటులోకి వస్తాయి. దీని ఫలితంగా రైతాంగానికి నకిలీ విత్తనాల మోసాల బారి నుంచి రక్షించబడటంతోపాటు నాణ్యమైన విత్తనం ద్వారా 10 నుంచి 15% మేర అదనంగా దిగుబడులు సాధించే అవకాశాలుంటాయి. రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయం అనేక రకాల కొత్త వంగడాలను అభివృద్ధి చేయగా, అందులో ముఖ్యమైన విత్తనాలను మాత్రం రైతులకు అందించేందుకు ప్రభుత్వం ప్రణాళికలను సిద్ధం చేస్తోంది.

సాగు పెరుగుతుంది



ప్రభుత్వం నాణ్యవంతమైన పప్పుధాన్యాల రకాల విత్తనాలు అందుబాటులోకి తీసుకువస్తే రైతులకు లాభదాయకంగా ఉంటుంది. దీంతో సాగు పెరిగేందుకు అవకాశం ఉంటుంది. హైబ్రీడ్ విత్తనాలపైనే అధికంగా ఖర్చు చేయాల్సి వస్తున్నది. ప్రభుత్వ నిర్ణయం సంతోషకరంగా ఉంది. పండించిన పంటకు మార్కెట్లో గిట్టుబాటు ధర ఉండేలా చూడాలి.

– గోవర్ధన్‌రెడ్డి, రైతు గుడ్‌పల్లి గ్రామం, మొగుడంపల్లి మండలం

ప్రణాళికలను సిద్ధం చేస్తోంది



పప్పుధాన్యాలతోపాటు వరి, జొన్న రకాల విత్తనాలను అందించేందుకు ప్రభుత్వం ప్రణాళికలను రూపొందిస్తోంది. ముందుకు విత్తనాలను వానాకాలం సీజన్‌లో అభ్యుదయ రైతులకు అందిస్తారు. వారు పండించిన పంటను తిరిగి విత్తనంగా ఉపయోగించుకునేందుకు తోటి రైతులకు అందజేస్తారు. దీంతో గ్రామంలోని రైతులందరికీ విత్తనాలు అందుబాటులోకి వస్తాయి. ఫలితంగా విత్తన సమస్య తీరుతుంది.

– భిక్షపతి, ఏడీఏ-జహీరాబాద్

లక్ష ఎకరాల్లో పప్పుధాన్యాల సాగు

సంగారెడ్డి జిల్లాలో ప్రతి ఏడాది లక్ష ఎకరాల్లో పప్పుధాన్యాల పంటలు సాగవుతున్నాయి. ఇందుకోసం అవసరమైన విత్తన రకాల అందుబాటులో లేకపోవడంతో రైతులు హైబ్రీడ్ విత్తనాలనే కొనుగోలు చేసుకుని సాగుచేస్తున్నారు. ఇందుకోసం అధికంగా వ్యయం చేయాల్సి వస్తోంది. 84వేల ఎకరాల్లో కందిపంట, 15 ఎకరాల్లో పెసర పంట, 8వేల ఎకరాల్లో మినుము పంటలు సాగవుతున్నాయి. 1.40లక్షల ఎకరాల్లో వరి, రెండు వేల ఎకరాల్లో జొన్న పంటను రైతులు సాగు చేసుకుంటున్నారు. ప్రభుత్వం విత్తనాల రకాలను అందుబాటులో ఉంచితే పప్పుధాన్యాల సాగు రెట్టింపు అయ్యే అవకాశం ఉందనే అభిప్రాయాన్ని రైతులు వ్యక్తం చేస్తున్నారు.



శుక్లవర్ధన్‌రెడ్డికి నియామకపత్రం అందజేస్తున్న ఎంపీ సురేశ్‌షెట్కార్

ఇక ప్రజలకు విస్తృత సేవలు

జహీరాబాద్ ఎంపీ సురేశ్ షెట్కార్

జహీరాబాద్: పార్లమెంట్ కేంద్రమైన జహీరాబాద్‌లో ఏర్పాటు చేసిన క్యాంపు కార్యాలయం ద్వారా ప్రజలకు మరింత విస్తృతమైన సేవలు అందించనున్నట్లు ఎంపీ సురేశ్ షెట్కార్ పేర్కొన్నారు. జహీరాబాద్‌లోని క్యాంపు కార్యాలయంలో శనివారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పార్లమెంట్ పరిధిలోని జహీరాబాద్, నారాయణఖేడ్, అందోల్, ఎల్లారెడ్డి, కామారెడ్డి, జుక్కల్, బాన్సువాడ అసెంబ్లీ స్థానాలకు సంబంధించిన ప్రజల సమస్యలను పరిష్కరించేందుకు వీలుగా జహీరాబాద్ క్యాంపు కార్యాలయం కేంద్రంగా కార్యకలాపాలను నిర్వహించనున్నట్లు చెప్పారు. పార్లమెంట్ క్యాంపు కార్యాలయ ఇన్‌చార్జిగా సీనియర్ నాయకుడు పస్తాపూర్‌కు చెందిన జి.శుక్లవర్ధన్‌రెడ్డిని నియమించినట్లు తెలిపారు. కార్యక్రమంలో మాజీమంత్రి ఎ.చంద్రశేఖర్, ఐడీసీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ ఎం.డి.తన్వీర్, కాంగ్రెస్ నాయకులు పి.నర్సింహారెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, శౌకత్, భాస్కర్‌రెడ్డి, మక్సూద్, అర్షద్, అశోక్, అస్మాతబస్సుమ్ పాల్గొన్నారు.

రాజ్యాంగంతో అన్ని వర్గాలకు లబ్ధి

అంబేడ్కర్ విగ్రహావిష్కరణలో ఎమ్మెల్యే వివేక్



గంగ్వార్ చౌరస్తా వద్ద అంబేడ్కర్ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న ఎంపీ సురేష్ షెట్కార్, ఎమ్మెల్యే వివేక్

జహీరాబాద్/న్యాల్‌కల్(జహీరాబాద్): రాజ్యాంగం ద్వారా కేవలం దళితులే కాదు అన్ని వర్గాల ప్రజలు లబ్ధి పొందుతున్నారని చెన్నూర్ ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి పేర్కొన్నారు. మండల పరిధిలోని గంగ్వార్ ప్రధాన చౌరస్తా వద్ద ఏర్పాటు చేసిన డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహాన్ని శనివారం జహీరాబాద్ ఎంపీ సురేశ్ షెట్కార్‌తో కలసి ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ...అట్టడుగు వర్గాల అభివృద్ధి కోసం అంబేడ్కర్ చేసిన కృషి చిరస్మరణీయమన్నారు. అంబేడ్కర్ వల్లే ఆర్‌బీఐ, తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు జరిగాయన్నారు. తమ ప్రభుత్వం ప్రజా సంక్షేమం కోసం పాటుపడుతోందని, ఎన్నడూ లేని విధంగా సీఎం రిలీఫ్ ఫండ్ కింద రూ.900కోట్ల నిధులను పేదలకు అందజేసిందని తెలిపారు. ఇందిరమ్మ ఇండ్ల పథకం కింద ఇండ్లకు నిధులను అందజేస్తున్నట్లు తెలిపారు. రూ.13వేల కోట్లతో పేదలకు సన్నబియ్యం పథకాన్ని అమలు చేస్తోందన్నారు.

బీజేపీ మతతత్వ పార్టీ: ఎంపీ సురేశ్ షెట్కార్

బీజేపీ మతతత్వ పార్టీ అని, దేశ రాజ్యాంగాన్ని మార్చేందుకు ప్రయత్నిస్తుందని జహీరాబాద్ ఎంపీ సురేశ్ షెట్కార్ ఆరోపించారు. నిమ్జ్ ఏర్పాటు వల్ల జహీరాబాద్ ముఖచిత్రం మారిపోతుందన్నారు. డాక్టర్ వెన్నెల గద్దర్ మాట్లాడుతూ...రాహుల్ గాంధీ ఆధ్వర్యంలో జై బాపు, జై సంవిధాన్ కార్యక్రమం మొదలైందని అందులో అందరూ భాగస్వామ్యులు కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఐడీసీ మాజీ చైర్మన్ తన్వీర్, నియోజకవర్గ మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు అస్మా తబస్సుమ్, కాంగ్రెస్ నాయకులు మహమ్మద్ తన్వీర్, భాస్కర్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, ఏఎంసీ వైస్ చైర్మన్ తిరుపతిరెడ్డి, పీఏసీఎస్ చైర్మెన్ సిద్ధిలింగయ్యస్వామి, దళిత సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

సమ్మెలో మిషన్ భగీరథ సిబ్బంది

- 119 గ్రామాలకు నిలిచిపోయిన నీటి సరఫరా
- ఇబ్బందులు పడుతున్న ప్రజలు
- సిబ్బందితో చర్చలు జరుపుతున్న అధికారులు

జహీరాబాద్: జహీరాబాద్ నియోజకవర్గానికి మిషన్ భగీరథ నీటి సరఫరా నిలిచిపోయింది. ఈ పథకంలో పని చేస్తున్న సిబ్బందికి వేతనాలు చెల్లించక పోవడంతో సమ్మెకు దిగారు. ఫలితంగా నీటిసరఫరా పూర్తిగా నిలిచి పోయింది. దీంతో ప్రజలు తాగు నీటి కోసం ఇబ్బందులు పడుతున్నారు. శుక్రవారం మధ్యాహ్నం నుంచి జహీరాబాద్, కోహీర్, ఝరాసంగం, న్యాల్‌కల్, మొగుడంపల్లి, మునిపల్లి మండలాలకు నీటి సరఫరా నిలిచిపోయింది. మొత్తం 119 గ్రామాలకు నీటి సరఫరా జరగక పోవడంతో అధికారులు స్థానికంగా ఉన్న నీటి వనరులపైనే ఆధారపడి తాగునీటిని సమకూర్చుకోవాలని ప్రజలకు సూచిస్తున్నారు. ఆదివారం నుంచి నీటి సరఫరా జరిగేలా సమ్మెకు దిగిన సిబ్బందితో చర్చలు జరుపుతున్నట్లు, అధికారులు పేర్కొంటున్నారు.

పచ్చని చెట్టే పర్యావరణానికి చేటు



పటాన్‌చెరులో రహదారి డివైడర్ పై భారీగా పెరిగిన కోనో కార్పస్ మొక్కలు

- రహదారుల గుండా ఏపుగా పెరిగిన కోనోకార్పస్
- నిషేధించిన ప్రభుత్వం

పటాన్‌చెరు టౌన్: పచ్చదనం మాటున విరివిగా పెరుగుతున్న కోనోకార్పస్ మొక్కలు ప్రజారోగ్యానికి, పర్యావరణానికి పెను ప్రమాదకరంగా మారుతున్నాయి. దుబాయి చెట్టుగా పిలవబడుతున్న ఈ వృక్షం ఇప్పటికే పలు దేశాలను కలవర పెడుతోంది. ముఖ్యంగా వీటి పుష్పాలు వెదజల్లే పుప్పొడితో శ్వాసకోశ, అలర్జీ సమస్యలు తలెత్తుతాయనే ప్రచారం ఉంది. ఈ క్రమంలోనే ప్రభుత్వం ఈ మొక్కలను నిషేధించింది.

జిల్లా పరిధిలో...

జీహెచ్ఎంసీ సర్కిల్-22, మున్సిపాలిటీల పరిధిలోని ప్రభుత్వ కార్యాలయాలు, జాతీయ రహదారి డివైడర్ల మధ్య, గ్రామాల్లో విరివిగా కోనోకార్పస్ మొక్కలు నాటారు. ఇప్పటికే ఇవి చెట్లుగా మారాయి. ప్రతీ చెట్టుకు పుష్పాలు రాగా...అవి వెదజల్లే పుప్పొడితో పలు శ్వాసకోశ వ్యాధులు, అలర్జీ సమస్యలు తలెత్తుతున్నాయి. పర్యావరణ సమస్యలకు కారణమవుతోందన్న కారణంతో కోనోకార్పస్ మొక్కలు నాటడాన్ని రాష్ట్ర ప్రభుత్వం నిషేధించింది. అయితే ఇటీవలే శాసనసభలో స్పీకర్ గడ్డం ప్రసాద్ కోనో- కార్పస్ మొక్కలను తొలగించాలని చెప్పిన విషయం తెలిసిందే.

పలు ఆరోగ్య సమస్యలకు కారణం...

కోనోకార్పస్ మొక్క పర్యావరణానికి హాని చేయడంతో పాటు ప్రజారోగ్య సమస్యలకు కారణమవుతోందని పొరుగుదేశమైన పాకిస్తాన్ గుర్తించింది. ముఖ్యంగా కరాచీ నగరంలో హఠాత్తుగా పెరుగుతున్న ఊపిరితిత్తుల వ్యాధిగ్రస్తుల సంఖ్యకు ఈ మొక్కలే కారణమని పరిశోధనల్లో తేల్చింది. అధిక సంఖ్యలో భూగర్భజలాలను వినియోగించుకునే సామర్థ్యం కలిగిన ఈ మొక్కలతో పర్యావరణానికి చేటని మరికొన్ని అరబ్ దేశాలు గుర్తించాయి.

మొక్కలను తొలగించాలి...



సర్కిల్ – 22 పరిధిలో రహదారి డివైడర్లపై, అదేవిధంగా ప్రభుత్వ కార్యాలయాలు ఎక్కడ చూసినా నేటికీ కోనోకార్పస్ మొక్కలు కనిపిస్తున్నాయి. అధికారులు వెంటనే స్పందించి భారీగా పెరిగిన మొక్కలను తొలగించాలి.

– మహేందర్, అంబేడ్కర్ కాలనీ పటాన్‌చెరు

శ్వాసకోశ, అలెర్జీలకు దారితీస్తుంది



కొనోకార్పస్ అనేది విదేశీ మొక్క. ఇది వేగవంతమైన పెరుగుదల, పచ్చదనం కఠినమైన పరిస్థితులకు అనుగుణంగా ఉండటం వలన దీనిని పరిశ్రమలు, రోడ్ల పక్కన ప్రకృతి దృశ్యాలకు సమీపంలో నాటడానికి ఉపయోగిస్తారు. కానీ, దురదృష్టవశాత్తు దీని పుప్పొడి మానవులలో శ్వాసకోశ సమస్యలు, అలెర్జీ, దగ్గుకు దారితీస్తోందని తేలింది. పర్యావరణ వ్యవస్థకు కూడా పెద్దగా ఉపయోగపడదు. ఇది ఎక్కువగా భూగర్భ జలాలను గ్రహిస్తుంది, మన స్థానిక జాతుల పెరుగుదలను కూడా నిరోధిస్తుంది.

– మల్లిక, వృక్షశాస్త్రం అసిస్టెంట్ ప్రొఫెసర్, ప్రభుత్వ డిగ్రీ కళాశాల

పాడి పరిశ్రమకు రుణాలు

మాంసం ఉత్పత్తి పెంచే దిశగా...

- రూ.50 లక్షల వరకు రాయితీ రుణం
- ఆన్‌లైన్ విధానంలో దరఖాస్తుల ఆహ్వానం
- అవగాహన లేక పథకానికి దూరం



సంగారెడ్డి జోన్: రోజురోజుకీ పెరుగుతున్న మాంసం వినియోగాన్ని దృష్టిలో ఉంచుకుని పశువుల పెంపకానికి కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టింది. గణనీయంగా పెరుగుతున్న మాంసం వినియోగానికి సరిపడా మాంసం ఉత్పత్తిని పెంచే దిశగా అడుగులు వేస్తోంది. పశువులతోపాటు మేత, దాణా లభ్యతను పెంపొందించేందుకు సైతం జాతీయ పశు సంపద మిషన్ (ఎన్ఎల్ఎం) ద్వారా రుణ అవకాశం కల్పిస్తోంది.

నేషనల్ లైవ్ స్టాక్ మిషన్ స్కీం ద్వారా రుణాలు

పశువుల పెంపకాన్ని ప్రోత్సహించేందుకు నేషనల్ లైఫ్ స్టాక్ మిషన్ స్కీం ద్వారా రుణాలను మంజూరు చేస్తుంది. ఇందులో భాగంగా గొర్రెలు, మేకలు, పొట్టేలు, పందులు, నాటుకోళ్లు, పుంజుల తోపాటు పశుగ్రాసం, దాణా పరిశ్రమల ఏర్పాటుకు ప్రోత్సాహం కల్పించనుంది. 2021-22 ఆర్థిక సంవత్సరంలో ప్రారంభమైన ఈ పథకం పశుసంవర్థక శాఖ అమలు చేసేందుకు చర్యలు చేపట్టింది. పశువుల పెంపకానికి ఆసక్తి ఉన్న వారికి సబ్సిడీ రుణాలు మంజూరు చేసేందుకు కృషి చేస్తుంది.

రూ.10లక్షల నుంచి రూ.50 లక్షల వరకు సబ్సిడీ

ఎస్.ఎల్.ఎం పథకం ద్వారా రూ.10లక్షల రూ.50 లక్షల వరకు సబ్సిడీని మంజూరు చేస్తుంది. లబ్ధిదారుడికి విడతల వారీగా సబ్సిడీ అందించనున్నారు. యూనిట్ నెలకొల్పిన తర్వాత సబ్సిడీ వచ్చేంత వరకు రాష్ట్ర పశుసంవర్ధక శాఖ పర్యవేక్షిస్తుంది.

ఆన్‌లైన్ విధానంలో దరఖాస్తులు

యూనిట్ స్థాపించేందుకు ఆసక్తి గలవారు www.nlm.udyamimitra.in వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చు. ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన దరఖాస్తు చేసుకునేందుకు ఎలాంటి ఫీజు లేదు. దరఖాస్తుదారుడి ఫొటో, అడ్రస్, ఆధార్ కార్డు, బ్యాంక్ స్టేట్‌మెంట్ తదితర పత్రాలను అప్లోడ్ చేయాల్సి ఉంటుంది.

అవగాహన లేక పథకానికి దూరం

పశువుల పెంపకానికి ప్రోత్సాహకంగా ఎన్ఎల్ఎం పథకం ద్వారా రుణాలు మంజూరు చేసి సబ్సిడీని అందిస్తుంది. పథకం ప్రారంభించి రెండు, మూడేళ్లు గడుస్తున్నప్పటికీ సరైన అవగాహన లేక పోవడంతో పథకానికి దూరంగా ఉన్నారు.

ఎన్ఎల్ఎం అందించే పథకం.. రాయితీ వివరాలు

మేకలు, గొర్రెలు+పొట్టేలు	యూనిట్ విలువ	సబ్సిడీ	రైతువాటా	బ్యాంకు రుణం
500+25	రూ.కోటి	రూ.50లక్షలు	రూ.10లక్షలు	రూ.40లక్షలు
400+20	రూ.80లక్షలు	రూ.40లక్షలు	రూ.8లక్షలు	రూ.32లక్షలు
300+15	రూ.60లక్షలు	రూ.30లక్షలు	రూ.6లక్షలు	రూ.24లక్షలు
200+15	రూ.40లక్షలు	రూ.20లక్షలు	రూ.4లక్షలు	రూ.16లక్షలు
100+5	రూ.20లక్షలు	రూ.10లక్షల	రూ.2లక్షలు	రూ.8లక్షలు
పందులు				
మగ+ఆడ	యూనిట్ విలువ	సబ్సిడీ	రైతువాటా	బ్యాంకు రుణం
100+10	రూ.30లక్షలు	రూ.15లక్షలు	రూ.3లక్షలు	రూ.12లక్షలు
50+5	రూ.15లక్షలు	రూ.7.5లక్షలు	రూ.1.5లక్షలు	రూ.6లక్షలు
నాటుకోడి పుంజు	యూనిట్ విలువ	సబ్సిడీ	రైతువాటా	బ్యాంకు రుణం
1000+100	రూ.50లక్షలు	రూ.25లక్షలు	రూ.5లక్షలు	రూ.20లక్షలు
దాణా, గడ్డి	రూ.కోటి	రూ.50లక్షలు	రూ.10లక్షలు	రూ.40లక్షలు

సద్వినియోగం చేసుకోవాలి



పశువుల పెంపకానికి కేంద్ర ప్రభుత్వం నేషనల్ లైవ్ స్టాక్ మిషన్ స్కీం ద్వారా రుణాలు మంజూరు చేస్తుంది. ప్రతీ యూనిట్‌పై 50% సబ్సిడీ అందిస్తారు. ఆన్‌లైన్ విధానంలో ఆసక్తి కలిగి ఉండి, అనుభవం కలిగి ఉన్న వారు దరఖాస్తు చేసుకోవచ్చు. అర్హత కలిగి ఉన్న ప్రతీ ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలి.

– వసంతకుమారి, జిల్లా పశు సంవర్థక శాఖ అధికారి, సంగారెడ్డి

క్లుప్తంగా

మక్కల ట్రాక్టర్ బోల్తా



బోల్తా పడిన ట్రాక్టర్

కోహెదరూరల్(హుస్నాబాద్): మక్కల లోడ్‌తో వెళ్తున్న ట్రాక్టర్ బోల్తా పడిన ఘటన మండలంలోని బస్వపూర్ గ్రామ శివారులో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. నాగసముద్రాల గ్రామానికి చెందిన చింతలపల్లి జనార్దన్ అనే రైతు మక్కల లోడ్‌తో సిద్దిపేటకు వెళ్తున్నాడు. బస్వపూర్ సమీపంలోకి రాగానే ఎదురుగా వస్తున్న లారీని తప్పించబోయి ట్రాక్టర్ బోల్తా పడింది. ఈ ప్రమాదంలో రైతుకు ఎలాంటి గాయాలు కాలేదు. మక్కలు రోడ్డు పక్కన ఉన్న గుంతలో పడ్డాయి.

దొంగతనం కేసులో ఇద్దరు రిమాండ్

వర్గల్(గజ్వేల్): దొంగతనానికి పాల్పడిన ఇద్దరు నిందితులను శనివారం కోర్టులో రిమాండ్ చేసినట్లు గజ్వేల్ రూరల్ సీఐ మహేందర్‌రెడ్డి తెలిపారు. ఆయన కథనం మేరకు.. పెద్దపల్లి జిల్లా సుల్తానాబాద్‌లోని సహస్రనగర్‌కు చెందిన వేముల చంద్రప్రకాశ్ అలియాస్ చందు(27), రాజన్న సిరిసిల్ల జిల్లా కోనరావుపేటకు చెందిన గాజుల హేమంత్(19) గతంలో దొంగతనం కేసుల్లో అరెస్టయ్యారు. కరీంనగర్ జైలులో వీరికి పరిచయం ఏర్పడింది. జైలు నుంచి బయటకు వచ్చిన తర్వాత దొంగతనాలు చేయాలని నిర్ణయించుకొని 10న గురువారం వర్గల్ మండలం గౌరారం చేరుకున్నారు. అర్ధరాత్రి వేళ పాములపర్తి చౌరస్తా వద్ద ఉన్న పూదరి శ్రీనివాస్‌గౌడ్ కిరాణ షాపు షట్టర్‌ను పైకిలేపి మూడు సీసీ కెమెరాలను ధ్వంసం చేసి రూ.5,000 నగదు ఎత్తుకెళ్లారు. షాపు యజమాని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు. దొంగతనానికి పాల్పడిన నిందితుల నుంచి రూ.800 నగదు, ఇనుప రాడ్ స్వాధీనం చేసుకొని శనివారం గజ్వేల్ కోర్టులో రిమాండ్ చేశామని సీఐ పేర్కొన్నారు.

బాలుడిపై కుక్కల దాడి

నర్సాపూర్: బాలుడిపై కుక్కలు దాడి చేసిన ఘటన నర్సాపూర్ మున్సిపాలిటీ పరిధి లోని హన్మంతాపూర్‌లో శనివారం ఘటన చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. హన్మంతాపూర్‌కు చెందిన స్వప్న, రాజు దంపతుల ఐదేళ్ల కుమారుడు ఉద్భవ్ ఇంటి సమీపంలో ఆడుకుంటున్నాడు. నాలుగైదు కుక్కలు ఒక్కసారిగా దాడి చేసి గాయపరిచాయి. మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌కు తరలించారు. వార్డులో వీధి కుక్కల బెడద బాగా పెరిగిందని, వాటిని అదుపు చేయాలని కోరారు.


అప్పుల బాధతో ఉరేసుకొని ఆత్మహత్య



శ్రీవర్ధన్‌రెడ్డి (ఫైల్)

ములుగు(గజ్వేల్): ఉరేసుకొని వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన ములుగు మండలం జప్తిసింగాయిపల్లిలో శనివారం చోటు చేసుకుంది. ఎస్ఐ విజయ్‌కుమార్ కథనం మేరకు.. గ్రామానికి చెందిన నీలం శ్రీవర్ధన్‌రెడ్డి(34) ఇంటి వద్దనే ఉంటూ చెడు వ్యసనాల బారిన పడ్డాడు. కొంత మేరకు అప్పులయ్యాయి. అప్పులు తీర్చలేక తరచూ బాధపడుతుండేవాడు. దీంతో మనస్తాపానికి గురై ఇంటిలో ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడి తండ్రి బాగిరెడ్డి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

విద్యుదాఘాతంతో యువ రైతు మృతి



పొలంలో రమేశ్ మృతదేహం

పుల్‌కల్(అందోల్): విద్యుదాఘాతంతో యువ రైతు మృతి చెందాడు. పుల్‌కల్ మండల పరిధిలోని మిన్‌పూర్ తండాలో చోటు చేసుకుంది. పుల్‌కల్ ఎస్ఐ క్రాంతికుమార్ కథనం మేరకు.. మిన్‌పూర్ తండాకు చెందిన రమావత్ రమేశ్ (32) నీళ్లు పారించడానికి శుక్రవారం రాత్రి పొలం వద్దకు వెళ్లాడు. అంతకు రెండు రోజుల ముందు.. గాలి వానకు విద్యుత్ తీగ తెగి కింద పడి పడింది. ఇది గమనించని రమేశ్ పొలం నుంచి అలాగే వెళ్తుండగా.. కాలికి తీగ తగిలి విద్యుదాఘాతంతో అక్కడికక్కడే మృతి చెందాడు. రాత్రి అయినా రమేశ్ ఇంటికి రాక పోవడంతో కుటుంబ సభ్యులు చుట్టుపక్కల వెతికారు. ఆచూకీ లభించకపోవడంతో శనివారం ఉదయం మరోసారి వెతుకుతుండగా పొలంలోనే చనిపోయి కనిపించాడు. మృతుని భార్య రమావత్ లత ఫిర్యాదు మేరకు పుల్‌కల్ పోలీసులు కేసు నమోదు చేశారు.

సాక్షి సండే క్లాసిఫైడ్స్

WANTED

■ త్రివేణి హోంకేర్ హైదరాబాద్‌లో వృద్ధులను పేషేంట్లను చూసుకొనుటకు వర్కర్స్/నర్సులు కావలెను. ఫ్రీ వసతి ఫుడ్ జీ:18k Ph: 9640400073, 9160900024 [SCA25002716]

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్/ డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

పోరు రాగం.. జీవన సరాగం

జానపదమే జీవితంగా ముందుకు సాగుతూ..

- గతంలో ప్రత్యేక రాష్ట్ర సాధనకు గొంతెత్తిన గళాలు
- ప్రస్తుతం సోషల్ మీడియా ఫోక్ స్టార్స్‌గా జిల్లా యువతీ, యువకులు
- వందల సంఖ్యలో పాటలు, లక్షల్లో వ్యూస్
- పల్లె పదాల పాటల్లో నటిస్తూ.. ఆడుతూ పాడుతూ

దుబ్బాకటౌన్: సామాజిక మాధ్యమాలను వేదికగా చేసుకొని సిద్దిపేట జిల్లాకు చెందిన యువ కళాకారులు తమ ప్రతిభను ప్రపంచానికి చాటుతున్నారు. తెలంగాణ మలిదశ ఉద్యమంలో గజ్జె కట్టి, మైక్ పట్టి ధూంధాం వంటి కార్యక్రమంలో కీలకపాత్ర పోషించిన ఎంతో మంది కళాకారులు యూట్యూబ్‌ను వేదికగా చేసుకొని తమ ప్రతిభను నిరూపించుకుంటున్నారు. యూట్యూబ్‌ల్లో లక్షల్లో వ్యూస్ పొందుతున్నారు.

రేలారే రేలా.. వివిధ టీవీ కార్యక్రమాలతో

మనం నేర్చుకున్న విద్య, చేస్తున్న వృత్తి, జీవితంలో ఎంచుకున్న మార్గం పెద్దల బాటల్ని బట్టే ఉంటాయి. సిద్దిపేట జిల్లా దుబ్బాక మండలం పద్మనాభునిపల్లి గ్రామానికి సాహిత్యంలో మంచి గౌరవం ఉన్నట్లే భార్గవి తల్లి భూదవ్వకు మంచి గుర్తింపు ఉంది. రేలారే రేలా.. వివిధ టీవీ కార్యక్రమాల్లో జానపద పాటలతో అలరించారు. తెలంగాణ ఉద్యమ సమయంలో ధూంధాం కార్యక్రమాల్లో తన ఆట, పాటలతో జనాన్ని కట్టి పడేసింది. ప్రస్తుతం జాన పదాలను పాడుతూ.. తానే స్వయంగా నటిస్తూ యూట్యూబ్‌లో ఫోక్ స్టార్‌గా పేరు గాంచింది. ప్రముఖ జానపద గాయకుడు కళాకారుడు శ్రీనివాస్ భార్గవిని చాలా ప్రోత్సహించేవాడు. ఆయన అప్పటికే జానపదాలు పాడుతుండేవాడు.

హేళన చేసిన చేతులే చప్పట్లు కొట్టాయి



మూడు తరాల నుంచి మా ఇంట్లో జానపదాలు జాలు వారుతూ వస్తున్నాయి. జాన పదాలంటే నాకు ప్రాణం. ధూంధాంలో వివిధ సభల్లో జాన పదాలు పాడుతుంటే ఆడ పిల్లవైన నీకు ఈ సభలలో పాడడం అవసరమా అని చాలా మంది హేళన చేసేవారు. కానీ వారే ఇప్పుడు చప్పట్లు కొడుతున్నారు. అమ్మ నేర్పిన పాటను జీవన పాఠంగా నేర్చుకొని గురువు నేర్పిన బాటలో ముందుకు సాగుతున్నాను. ఇప్పటి వరకు 10 పాట్లల్లో నటించగా, ఆధ్యశ్రీ మ్యూజిక్ ఛానల్‌కు 2.90 లక్షల మంది సబ్‌స్క్రైబర్లు వచ్చారు. భవిష్యత్‌లో మరింతగా రాణిస్తాను.

-ముక్కపల్లి భార్గవి

డప్పు కొట్టుకుంటూ పాడడం, డ్యాన్స్ చేస్తూ పాడడం నేర్పించి కొత్త భార్గవిగా తయారు చేశాడు. ఆయన వల్లే రేలారే రేలాలో భార్గవికి అవకాశం వచ్చింది.

కళను నేర్పిన కళాకారుడితోనే వివాహం

పాటతో ప్రారంభమైన భార్గవి జీవితంలో మరో పాటగాడు ఆమె జీవిత భాగస్వామి అయ్యాడు.. ఆట, పాట నేర్పిన కళాకారుడు ముక్కపల్లి శ్రీనివాస్‌ను భార్గవి వివాహం చేసుకుంది. భార్గవి, శ్రీనివాస్ కలిసి పాడి నటించిన.. కుటుంబ నేపథ్యానికి చెందిన జానపదాలైన బంతి పూల వాసన నీ బానిస్న, చిన్ననాడు పెట్టిన చిక్కుడు చెట్టు, పోంగ పోంగా పొట్లా చెరువు, కొత్త కుండాల రెండిత్తు నాలత్తో .. వంటి పాటలు అధ్యశ్రీ మ్యూజిక్ ద్వారా యూట్యూబ్‌లో విడుదలై ప్రజల నుంచి మంచి ఆదరణ పొందుతున్నాయి.

మరికొందరు కళాకారులు

దుబ్బాక మండలం పెద్ద చీకోడ్ గ్రామానికి చెందిన కమ్మరి నర్సింలు, పెద్దగుండవెల్లి గ్రామానికి చెందిన బిట్ల ఎల్లం, దుబ్బాకకు చెందిన తుమ్మల ఎల్లం ఆస రామారావు, తదితర కళాకారులు, కవి గాయకులు తెలంగాణ మలిదశ ఉద్యమ సమయంలో కీలక పాత్ర పోషించి నేడు సోషల్ మీడియా ద్వారా తమ కళను నిరూపించుకుంటున్నారు.



పాట చిత్రీకరణలో ముక్కపల్లి శ్రీనివాస్, భార్గవి దంపతులు

సోపతి మ్యూజిక్ సత్తా చాటుతూ..



సిద్దిపేట జిల్లా నంగునూర్ మండలం తిమ్మాయిపల్లి గ్రామానికి చెందిన పిల్లి కార్తీక్ ముదిరాజ్ 2019 సంవత్సరంలో వస్తావ పిల్ల ఓ మధుబాల పాట ద్వారా పరిచయమై సోపతి యూట్యూబ్ ఛానల్ ద్వారా సత్తా చాటుతున్నాడు. 30కి పైగా పాటల్లో నటించి జిల్లాలో ప్రజల మన్ననలు పొందుతున్నాడు. ఇటీవల ప్రారంభించిన సోపతి యూట్యూబ్ ఛానల్‌కు 7 వేల మందికి పైగా సబ్ స్క్రైబర్లు ఉన్నారు. అత్తని చూడది అన్నమెయ్యది పాట 1.5 మిలియన్ వ్యూస్‌తో మంచి ఆదరణ పొందింది.

200 పైగా పాటల్లో మౌనిక డింపుల్



పాట చిత్రీకరణలో మౌనిక డింపుల్

మౌనిక డింపుల్ డ్యాన్స్‌లో తనకంటూ.. ప్రత్యేక గుర్తింపు సంపాదించుకొని దాదాపు 200కు పైగా పల్లె పదాల పాటల్లో నటించింది. చిన్నకోడూర్ మండలం రామునిపట్ల గ్రామానికి చెందిన మౌనిక మొదట సైడ్ డ్యాన్సర్‌గా వచ్చి డ్యాన్స్‌లో మెళుకువలు నేర్చుకొని జిల్లాలోనే కాదు రాష్ట్రంలోనే ఎంతో మంది ఆదరాభిమానాలు పొందింది. పల్లెదనం ఉట్టిపడేలా పల్లెటూరి యువతీల పాటల్లో నటిస్తూ హోరెత్తిస్తుంది. ఇన్‌స్ట్రాగామ్‌లో రీల్స్ చేస్తూ.. ముందుకు సాగుతుంది. డ్యాన్స్‌లో, యాక్టింగ్‌లో నాకు ఎంతో ప్రోత్సాహం ఇచ్చి నేను 200 పల్లె పదాల్లో నటించడానికి నా గురువులే కారణం. నన్ను ప్రోత్సహించిన కార్తీక్ ముదిరాజ్, హరీశ్ పటేల్‌కు రుణపడి ఉంటానని చెప్పుకొచ్చింది.

దివ్యాంగుడైనా కళాకారులను ప్రోత్సహిస్తూ..



సిద్దిపేట రూరల్ మండలం రావురూకుల గ్రామానికి చెందిన గడ్డం శ్రీనివాస్ రెడ్డి దివ్యాంగుడైనా కొత్త కళాకారులను ప్రోత్సహిస్తూ.. పల్లె సవ్వడి ఛానెల్ ద్వారా ప్రొడ్యూసర్‌గా వ్యవహరిస్తున్నాడు. 6 పాటలకు ప్రొడ్యూసర్‌గా వ్యవహరించి కొత్త కళాకారులకు అవకాశం కల్పిస్తున్నాడు.

పీఎం క్రియేషన్స్: 8 లక్షల సబ్‌స్క్రైబర్లు



సిద్దిపేట రూరల్ మండలం రావురూకుల గ్రామానికి చెందిన పార్వతీ మహేశ్ తెలంగాణ ఉద్యమ సమయంలో విద్యార్థి విభాగంలో కళాకారుడిగా పాల్గొన్నాడు. ఉద్యమ సమయంలో పలు వేదికల్లో ఆట, పాటతో అలరించాడు. పీఎం క్రియేషన్స్ యూట్యూబ్ ఛానల్ ద్వారా పల్లె పదాలను అందిస్తున్నాడు. మంచి పాటల రచయితగా గుర్తింపు పొందిన మహేశ్ 50 పాటలు పైగా రచించి, 30 పాటలకు ప్రొడ్యూస్ చేశాడు. 40 పాటల్లో నటనతో అలరించాడు. 8 లక్షల మంది సబ్ స్క్రైబర్లు ఉన్నారు. భార్య సంజన సైతం సింగర్ కావడం విశేషం. నాయి దొరో.. నా రాజమని పాట 100 మిలియన్ వ్యూస్‌తో జనాధారణ పొందింది.

ఆస్తి కోసం తండ్రిపై కత్తితో దాడి

- బాధితుడి పరిస్థితి విషమం
- చిన్న చింతకుంటలో ఘటన

నర్సాపూర్‌రూరల్: ఆస్తి కోసం కన్న తండ్రిపైనే కుమారుడు కత్తితో దాడి చేశాడు. ఈ ఘటన మండలంలోని చిన్నచింతకుంటలో శనివారం చోటు చేసుకుంది. గ్రామస్తులు, బాధిత కుటుంబ సభ్యుల కథనం మేరకు.. చిన్నచింతకుంట గ్రామానికి చెందిన వడ్ల దశరథ, లక్ష్మీ దంపతులకు ఇద్దరు కుమారులు ఉన్నారు. పెద్ద కొడుకు నాగరాజు పెళ్లి కాగా భార్యతో గొడవ పడటంతో పుట్టింటికి వెళ్లింది. దీంతో అతడు నర్సాపూర్‌లో టైలర్ పని చేసుకుంటూ ఉంటున్నాడు. తన వాటా ఆస్తి పంచి ఇవ్వాలని పలుమార్లు తల్లిదండ్రులతోపాటు తమ్ముడు శేఖర్‌తో గొడవపడ్డాడు. గ్రామంలో పెద్దల పంచాయితీ పెట్టి నచ్చజెప్పారు. రెండు రోజుల కిందట మళ్లీ ఆస్తి పంచి ఇవ్వాలని నాగరాజు తండ్రితో గొడవపడ్డాడు. గ్రామస్తుల సమక్షంలో పంచాయితీ నిర్వహించగా తండ్రి పేరున ఉన్న మూడు ఎకరాల భూమిని పంచి ఇచ్చేందుకు అంగీకరించారు. ప్రస్తుతం ఉంటున్న ఇల్లు మాత్రం చిన్న కొడుకు శేఖర్ పెండ్లి అయిన తర్వాత పంచుతామని చెప్పారు. దీంతో గొడవ సద్దుమణిగింది. శనివారం దశరథ ఇంట్లో ఉండగా భార్య లక్ష్మీ, శేఖర్ వేరే గ్రామానికి బంధువుల ఇంటికి వెళ్లారు. ఆస్తి విషయంలో కక్ష పెంచుకున్న నాగరాజు తండ్రిని కత్తితో పొడిచాడు. తీవ్ర రక్త స్రావం జరుగగా చుట్టుపక్కల వారు అరుపులు విని బాధితుడిని నర్సాపూర్ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అక్కడ వైద్యులు సూచన మేరకు హైదరాబాద్‌కు తరలించారు. నాగరాజు పరారీలో ఉండగా, బాధితుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ లింగం తెలిపారు.

వివాహ వేడుకకు వెళ్లొస్తుండగా లారీ ఢీకొని

నర్సంపల్లి గ్రామంలో రైతు మృతి



లారీ కింద రైతు గోపాల్

తూప్రాన్: లారీ కింద పడి రైతు మృతి చెందిన ఘటన మండలంలోని నర్సంపల్లి గ్రామంలో శనివారం చోటు చేసుకుంది. ఎస్ఐ శివానందం కథనం మేరకు.. మాసాయిపేట మండలం చెట్ల తిమ్మాయిపల్లి నడిమి తండాకు చెందిన కట్రోత్ గోపాల్(55) అనే రైతు టీవీఎస్ వాహనంపై శనివారం నర్సంపల్లి తండాలోని బంధువుల ఇంటికి వివాహానికి వెళ్లాడు. తిరిగి వస్తున్న క్రమంలో వెనుకాల నుంచి లారీ ఢీకొట్టింది. గోపాల్ లారీ చక్రాల కింద పడి అక్కడికక్కడే మృతి చెందాడు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పరిశీలించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టామని ఎస్ఐ తెలిపారు.

పాముకాటుతో వ్యక్తి..



శ్రీనివాస్(ఫైల్)

గజ్వేల్‌రూరల్: పాముకాటుతో వ్యక్తి మృతి చెందిన ఘటన మండల పరిధిలోని శ్రీగిరిపల్లిలో శనివారం చోటు చేసుకుంది. గ్రామస్తుల కథనం మేరకు.. గ్రామానికి చెందిన పాండవుల శ్రీనివాస్(35)కు భార్యతోపాటు ముగ్గురు పిల్లలు ఉన్నారు. రోజు మాదిరిగానే శనివారం వ్యవసాయ పొలం వద్దకు వెళ్లి పనులు చేస్తుండగా శ్రీనివాస్‌ను పాముకాటు వేసింది. అపస్మారకస్థితిలోకి వెళ్తున్నట్లు గుర్తించి అక్కడే ఉన్న స్థానికులకు సమాచారం అందించాడు. వెంటనే గజ్వేల్ ప్రభుత్వాస్పత్రికి తరలించి, మెరుగైన చికిత్స కోసం ఆర్‌వీఎం ఆస్పత్రికి తీసుకువెళ్లగా పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు ధ్రువీకరించారు.

లెక్చరర్‌కు సీఎం సత్కారం

గ్రూప్‌-1 ఫలితాల్లో రెండో ర్యాంకు సాధించిన వెంకటరమణ



వెంకటరమణను సత్కరిస్తున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

జహీరాబాద్: జహీరాబాద్‌లోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో లెక్చరర్‌గా పని చేస్తున్న దాది వెంకట రమణ గ్రూప్‌-1 ఫలితాల్లో రాష్ట్ర స్థాయిలో రెండో ర్యాంకును సాధించినందుకుగాను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సత్కరించి అభినందించారు. శనివారం సీఎం రేవంత్‌రెడ్డిని వెంకటరమణ తల్లిదండ్రులు రమాదేవి, శ్రీనివాసరావులు ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి పుష్ప గుచ్ఛం అందజేసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా వెంకటరమణ కుటుంబ నేపథ్యం గురించి సీఎం అడిగి తెలుసుకున్నారు. నల్లగొండ జిల్లా కేంద్రానికి చెందిన వెంకటరమణ జహీరాబాద్‌లోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జూనియర్ లెక్చరర్‌గా పనిచేస్తున్నారు. ఇప్పటి వరకు ఐదు ప్రభుత్వ ఉద్యోగాలు సంపాదించిన వెంకటరమణ పట్టుదలతో చదివి రాష్ట్ర స్థాయిలో రెండో ర్యాంకును సాధించడం అభినందనీయమని సీఎం పేర్కొన్నారు. కార్యక్రమంలో సాత్విక్‌రెడ్డి, అఖిల్‌రెడ్డి, రమణారెడ్డి పాల్గొన్నారు.

దత్తగిరిలో ఘనంగా హనుమాన్ జయంతి

ఝరాసంగం(జహీరాబాద్): బర్దీపూర్ శ్రీ దత్తగిరి మహారాజ్ ఆశ్రమంలో హనుమాన్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. శనివారం జయంతిని పురస్కరించుకుని బర్దీపూర్‌తోపాటు వివిధ గ్రామాల్లో వేడుకలను భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. స్వామి వారికి ప్రత్యేక పూజలు చేసి, డోలారోహణం తదితర కార్యక్రమాలు నిర్వహించారు.

చికిత్స పొందుతూ యువకుడు మృతి



రంజిత్ కుమార్(ఫైల్)

కొల్చారం(నర్సాపూర్): రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ యువకుడు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ ఘటన మండలం రంగంపేటలో శనివారం చోటు చేసుకుంది. ఎస్ఐ మహమ్మద్ గౌస్ కథనం మేరకు.. గ్రామానికి చెందిన పోసన్న గారి యాదగిరి, రామమ్మ దంపతుల చిన్న కుమారుడు రంజిత్ కుమార్(22) 6న రాత్రి కోనాపూర్‌లో స్నేహితుడి వద్దకు వెళ్లి వస్తానని ఇంటి నుంచి వెళ్లాడు. అక్కడి నుంచి తిరిగొస్తుండగా కోనాపూర్ శివారు మార్గమధ్యలో బైక్ పూర్తిగా దెబ్బతిని, తీవ్ర గాయాలతో పడి ఉన్నాడు. అపస్మారక స్థితిలో ఉన్న రంజిత్ కుమార్‌ను అటు వైపు వెళ్తున్న వారు చూసి కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం సంగారెడ్డిలోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన వైద్యం కోసం రెండు రోజుల కిందట గాంధీ ఆస్పత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ తెల్లవారుజామున మృతి చెందాడు. తమ కుమారుడిపై ఎవరో దాడి చేశారని అనుమానం వ్యక్తం చేస్తూ తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

మంచంపై నుంచి కిందపడ్డ వ్యక్తి..



పెంటారెడ్డి మృతదేహం

పాపన్నపేట(మెదక్): చికిత్స పొందుతూ వ్యక్తి మృతి చెందిన ఘటన మండల పరిధిలోని చీకోడ్‌లో శనివారం చోటు చేసుకుంది. పాపన్నపేట ఎస్సై శ్రీనివాస్ గౌడ్ కథనం మేరకు.. గ్రామానికి చెందిన గడ్డం పెంటారెడ్డి (72) వ్యవసాయం చేసుకుంటూ జీవిస్తున్నాడు. 3న ఇంట్లో మంచంపై నిద్రిస్తుండగా ప్రమాద వశాత్తు కిందపడ్డాడు. తలకు గాయం కావడంతో మొదట స్థానికంగా వైద్యం చేయించారు. 11న మెరుగైన వైద్యం కోసం మెదక్‌కు అక్కడి నుంచి హైద్రాబాద్‌లోని గాంధీ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడు.

దంపతుల మధ్య గొడవ వాటర్ ట్యాంక్‌పై నుంచి దూకిన భర్త

ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి



కనకయ్య (ఫైల్)

మిరుదొడ్డి(దుబ్బాక): భార్యాభర్తల మధ్య జరిగిన ఘర్షణ భర్త ఆత్మహత్యకు దారి తీసింది. క్షణికావేశంలో వాటర్ ట్యాంక్ ఎక్కి దూకిన భర్త తీవ్ర గాయాలతో ఆస్పత్రి పాలై చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ ఘటన మండల పరిధిలోని మల్లుపల్లిలో శనివారం చోటు చేసుకుంది. మిరుదొడ్డి పోలీసుల కథనం మేరకు.. గ్రామానికి చెందిన పాలమాకుల కనకయ్య (38) సరిత దంపతులు. వీరికి 18 ఏళ్లలోపు ముగ్గురు ఆడపిల్లలు ఉన్నారు. కనకయ్య వ్యవసాయ కూలీ పనులతో పాటు, హమాలీ పనులు చేస్తుంటాడు. కొద్ది కాలంగా మద్యానికి బానిసయ్యాడు. దీంతో భార్యాభర్తల మధ్య గొడవలు జరుగుతున్నాయి. శుక్రవారం సాయంత్రం డబుల్ బెడ్‌రూంల సమీపంలో భార్యాభర్తల మధ్య తీవ్ర స్థాయిలో ఘర్షణ చోటు చేసుకుంది. సరిత దంపతులు కలుగజేసుకొని కనకయ్యను తిట్టడంతో అవమానంగా భావించి క్షణికావేశంలో పక్కనే ఉన్న ఓవర్ హెడ్ వాటర్ ట్యాంక్‌పై ఎక్కాడు. గమనించిన స్థానికులు కిందికి దిగి రావాలని వారించినా వినకుండా ఒక్కసారిగా దూకేశాడు. మొదట ట్యాంక్ సమీపంలోని కరెంటు తీగలపై పడ్డాడు. విద్యుదాఘాతంతో తీవ్ర గాయాలై అక్కడి నుంచి మళ్లీ కిందపడ్డాడు. స్థానికులు వెంటనే సిద్దిపేట జిల్లా ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శనివారం తెల్లవారు జామున మృతి చెందాడు. మృతుడి భార్య సరిత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ బోయిని పరుశరామ్ తెలిపారు.

ఫోన్‌లో పరిచయం.. ఆపై అత్యాచారం

- మహిళను బెదిరించి పుస్తెలతాడు, సెల్‌ఫోన్‌తో పరారైన వ్యక్తి
- పోలీస్‌స్టేషన్‌లో వివాహిత ఫిర్యాదు
- వట్‌పల్లిలో ఆలస్యంగా వెలుగులోకి
- పోలీసుల అదుపులో నిందితుడు!

వట్‌పల్లి(అందోల్): ఫోన్‌లో పరిచయమైన ఓ వ్యక్తి వివాహిత మహిళను అత్యాచారం చేసి ఆమె మెడలో ఉన్న బంగారు నగలతోపాటు సెల్‌ఫోన్ ఎత్తుకెళ్లిన ఘటన వట్‌పల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో శనివారం వెలుగు చూసింది. ఎస్ఐ విఠల్ కథనం మేరకు.. మండల పరిధిలోని పల్వట్ల గ్రామానికి చెందిన ఓ వివాహిత(35) ఆదివారం జోగిపేటలో చీరలు కొన్నది. చీర డ్యామేజ్ ఉండటంతో తిరిగి ఇవ్వడానికి గురువారం జోగిపేటకు వెళ్లింది. ఫోన్‌కు గుర్తు తెలియని వ్యక్తి నుంచి కాల్ రాగా లిఫ్ట్ చేసి మాట్లాడగా.. కొత్త వ్యక్తి అని ఫోన్ కట్ చేసింది. మళ్లీ ఫోన్ చేసి నీవు నాకు తెలుసు, నీ నంబర్ నా దగ్గర ఉంది.. అంటూ పరిచయం చేసుకొని ఎక్కడ ఉన్నావు అని అడుగగా తాను ఉన్న బట్టల షాపు అడ్రస్ చెప్పింది. వెంటనే అక్కడికి వచ్చి వ్యక్తి ఆమె డబ్బులను షాపులో చెల్లించాడు. షాపింగ్ ముగిసిన తర్వాత సాయంత్రం 5 గంటల సమయంలో మహిళను బైక్ నూ ఎక్కించుకున్నాడు. అల్లాదుర్గం మండలం బహిరన్‌దిబ్బ గ్రామ రోడ్డు సమీపంలోకి రాగానే వర్షం రావడంతో తన బైక్‌ను నిలిపాడు. మళ్లీ రాత్రి 8 గంటల ప్రాంతంలో మహిళను ఎక్కించుకొని చెట్ల పొదల్లోకి తీసుకెళ్లి అత్యాచారం చేశాడు. అనంతరం బైక్‌పై వట్‌పల్లి మీదుగా బాధిత మహిళ గ్రామం పల్వట్ల వైపు వెళ్తూ నాగులపల్లి గ్రామ సమీపంలోకి రాగానే మహిళను దిగమన్నాడు. నన్ను మా ఇంటి దగ్గర దించాలంటూ ఆమె బైక్ దిగలేదు. దీంతో ఇద్దరి మధ్య గొడవ పెరిగింది. అతడు మహిళను బయపెట్టి మెడలో ఉన్న రెండు తులాల బంగారు పుస్తెల తాడు, సెల్‌ఫోన్ తీసుకొని పరారయ్యాడు. బాధిత మహిళ అదే రాత్రి వట్‌పల్లి పోలీసులకు ఫిర్యాదు చేసింది. కాల్‌డేటా ఆధారంగా మనూర్ మండలం బెల్లాపూర్ గ్రామానికి చెందిన వ్యక్తిగా గుర్తించి అతడిని అదుపులోకి తీసుకొని విచారణ జరుపుతున్నట్లు ఎస్ఐ తెలిపారు.

పదకొండేళ్ల తర్వాత తల్లిదండ్రుల చెంతకు..

- ఇంట్లో చెప్పకుండా 2014లో వెళ్లిపోయిన యువకుడు
- అప్పటి నుంచి వెతుకుతున్న తల్లిదండ్రులు
- వారం కిందట పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు
- సాంకేతికతను ఉపయోగించి పట్టుకున్న పోలీసులు
- అమ్మానాన్నలకు భారం కావొద్దని వెళ్లానంటున్న తేజసాయి



వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి



తండ్రి శ్రీనివాస్‌రావుతో తేజసాయి

మెదక్ మున్సిపాలిటీ: తల్లిదండ్రులకు భారం కావొద్దని, సొంతంగా డబ్బులు సంపాదించి ఇంటికొస్తానని లక్ష్యంతో ఇంట్లో చెప్పకుండా వెళ్లిన యువకుడు 11 ఏళ్ల తర్వాత దొరికాడు. దీంతో ఎప్పటికైనా తమ కుమారుడు ఇంటికొస్తాడని ఎదురుచూసిన తల్లిదండ్రుల కళ్లల్లో ఆనందం వెల్లువిరిసింది. ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి శనివారం జిల్లా పోలీసు కార్యాలయంలో విలేకరుల సమావేశం వివరాలు వెల్లడించారు. పాపన్నపేట మండలం కుర్తివాడ గ్రామానికి చెందిన కూనమనేని శారద-శ్రీనివాస్‌రావు కుమారుడు కూనమనేని తేజసాయి హైదరాబాద్‌లోని డీఆర్‌కే ఇంజనీరింగ్ కళాశాలలో మొదటి సంవత్సరం 2014లో చేశాడు. తల్లిదండ్రులపై భారం కావద్దన్న ఉద్దేశ్యంతో 7 సెప్టెంబర్ 2024లో ఎవరికీ ఇంటినుంచి వెళ్లిపోయాడు. ఎక్కడా వెతకినా ఆచూకీ లభించలేదు. పదకొండేళ్లు గడిచిపోయినా ఎలాంటి సమాచారం లేకపోవడంతో 3న పాపన్నపేట పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా మిస్సింగ్ ఫిర్యాదు చేశారు. కేసును ఛాలెంజింగ్‌గా తీసుకున్న పోలీసులు అధునాతన సాంకేతిక పరిజ్ఞానం వినియోగించారు. తేజ సాయి పేరు మార్చుకోకుండా అదేపేరుతో కొనసాగుతుండటం కేసు త్వరగా ఛేదించేందుకు దోహదపడింది. అతడు బెంగళూరులో ఉన్నట్టు గుర్తించి తల్లిదండ్రులకు అప్పగించారు. వారం రోజుల కిందట నమోదైన మిస్సింగ్ కేసును త్వరగా మెదక్ రూరల్ సీఐ రాజశేఖర్ రెడ్డి, పాపన్నపేట ఎస్ఐ శ్రీనివాస్ గౌడ్‌ను ఎస్పీ అభినందించారు.

ఉన్నతంగా ఎదగాలన్న లక్ష్యంతోనే..

జీవితంలో ఉన్నతంగా ఎదగాలన్న లక్ష్యంతోనే ఇంటి నుంచి వెళ్లిపోయానని, బెంగుళూరులో ఉంటూ అక్కడే జీవనం సాగిస్తున్నట్లు తేజ సాయి చెప్పాడు. కాంట్రాక్ట్ పనులు చేసుకుంటూ ఆర్థికంగా కొంత ఆర్థికంగా ఎదిగాడు. తల్లిదండ్రులపై ఆధార పడకుండా ఏదైనా సాధించాలన్న ఉద్దేశ్యంతో వెళ్లానని, ఆర్థికంగా ఎదిగిన తర్వాతనే ఇరవై ఏళ్లకు వస్తానని లక్ష్యం పెట్టుకున్నట్లు చెప్పుకొచ్చాడు.